


# నిజమైన భక్తి

ములాపు బాలకేశవులు

మహాశివరాత్రినాడు పార్వతీ పరమేశ్వరులు వింతలు, విశేషాలూ చూడాలని బయలుదేరారు. మొదట శివాలయంలో ఒక బ్రాహ్మణ దంపతుల పూజ పునస్కారాలు చూశారు. అది వారికి తృప్తి కలిగించలేదు. అక్కడ నుండి ఒక కొబ్బరి తోట వైపు కెళ్ళారు. అక్కడి యజమాని ఒక కుర్రవాడి దగ్గర బాగా పనిచేయించుకుని చివరికి వాడికిస్తానన్న రెండు కొబ్బరికాయలకు ఒకటే ఇచ్చి పంపాడు. తరువాత తోటలోని కాయలన్నీ ఒలిపించి శివలింగానికి అభిషేకించడానికి ఆలయానికి తీసుకెళ్ళాడు. ఆది చూసి పార్వతి "నాథా! మీ భక్తుడికి మీపై అపార భక్తి కదూ" అంది.

అందుకు శివుడు "కాదు దేవీ! ఇతను నిజమైన భక్తుడు కాదు. దొంగబేరాలు చేసిన సొమ్ముతో నన్ను పూజిస్తున్నాడు. చివరికి ఆ కొబ్బరి తోటలో పనిచేసిన చిన్న పిల్లవాణ్ని మోసం చేశాడు. అలాంటి డబ్బుతో నాకు పూజ చేస్తే నేను ఎలా సహించగలను దేవీ? అన్నాడు.

తరువాత అక్కడి నుంచి కొంచెం ముందుకి వెళ్ళారు. దారిలో ఒక ముసలి అవ్వను చూశారు. ఆ అవ్వ కడు బీదరాలు. ఆమెకున్న ఆస్థి ఒక ఆవు, దాని దూడ మాత్రం. అవ్వ పాలు తీయడానికి ఆవు వద్దకు వెళ్ళి, ముందు దూడను బాగా త్రాగనిచ్చి తరువాత చిన్న పాత్రలో కొంచెం పాలను మాత్రం ఆవునుంచి పితికి తీసుకుని, తిరిగి దూడను ఆవు వద్ద వదలి, పాలను తీసుకుని శివాలయానికి బయలుదేరింది.

ఇది చూస్తున్న శివపార్వతులు ఆ అవ్వగుణాన్ని పరీక్షిద్దామని ఇద్దరూ పండు ముసలి దంపతులుగా మారి, దాహం దాహం అంటూ అవ్వకు ఎదురయ్యారు. ఆ మాటలు విని అవ్వ వారికి దాహం తీర్చుకోడానికి ఆ పాలను ఇచ్చింది. వారు ఒక్క చుక్క కూడా మిగల్చకుండా త్రాగేశారు. అవ్వ పాత్రను వారి వద్ద నుంచి తీసుకుని, అక్కడికి దగ్గరలో ఉన్న ఓ పుష్పాన్ని అందులోవేసి ఆలయానికి వెళ్ళి, శివలింగంపై పుష్పాన్ని ఉంచి, దగ్గరలో ఉన్న నీటితో అభిషేకం చేసింది. ఆమె భక్తితో చేసిన అభిషేకం శివునికి తృప్తి నిచ్చింది. అప్పటికి కొన్ని వందల కొబ్బరికాయలు కొట్టినా నిండని తొట్టి, అవ్వ పోసిన నీటితో నిండిపోయింది. అది చూసి అక్కడ ఉన్న ప్రజలు ఆశ్చర్యపోయారు. వారితోబాటు పార్వతీదేవి ఆశ్చర్యపోయింది.

అప్పుడు పార్వతి "నాథా! అంతమంది బ్రాహ్మణోత్తములు ఎన్నో కొబ్బరికాయలు కొట్టినా నిండని తొట్టి, చిన్న పాత్రతో నీటిని పోసిన వెంటనే ఎలా నిండింది? అని ప్రశ్నించింది పార్వతి.

అందుకు శివుడు... దేవీ! వారు భక్తితో పూజించిన మాట నిజమే. వారు సంపాదించిన ధనం న్యాయమైనది కాదు. అది కాకుండా ఇంట్లో చిన్న పిల్లలు ఆకలితో ఏడుస్తూంటే, వారికి పెట్టకుండా నాకు ఉంచితే, నేను ఎలా సహించగలను? ఆ ముసలి అవ్వ ముందు దూడ ఆకలి తీర్చింది. తరువాత, ముసలివారుగా ఉన్న మన దాహం తీర్చింది. తరువాత దేవుని వద్దకు వెళ్ళి నీటితో పూజించింది. అదియే నిజమైన భక్తి. నాకు తృప్తి కలిగింది. ముందు ఇక్కడ ఉండేవారి ఆకలి తీరిస్తే, నాకు తృప్తిని కలిగించిన వారవుతారు అన్నాడు. అప్పుడు పార్వతికి అంతా అర్థమైంది. శివునికి తృప్తి కలిగించడం సులభం కాదు అని కూడా తెలుసుకుంది. ఇక భూలోక వింతలు చాలనుకొని, భూలోక సంచారం ముగించుకుని కైలాస పర్వతానికి వెళ్ళిపోయారు. ❋